క్లుప్తంగా

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

గచ్చిబౌలి: జయభేరి విద్యుత్ ఫీడర్ పరిధిలో మరమ్మతుల కారణంగా ఆదివారం విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్లు గచ్చిబౌలి ఏఈ వేణుగోపాల్ తెలిపారు. ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు ఏపీహెచ్‌బీ కాలనీ, డాగ్ పార్కు ప్రాంతం, రాడిసన్ హోటల్, లీ మెరీడియన్ ప్రాంతాలలో విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నామని వినియోగదారులు గమనించాలని ఆయన కోరారు.

ఐ బొటిక్ ప్రారంభం



గచ్చిబౌలి: ఇప్పటి వరకు మార్కెట్‌లో స్మార్ట్ ఫోన్లు, స్మార్ట్ వాచ్‌లు సందడి చేశాయి, ఇప్పుడు కొత్తగా ఐబొటిక్ లగ్జరీ సన్ గ్లాసెస్‌ను అందుబాటులోకి తీసుకొచ్చారు. హైటెక్‌సిటీ ప్రాంతంలో నిర్వాహకులు డాక్టర్ జగదీశ్‌రెడ్డి, ప్రణతిరెడ్డి, డాక్టర్ హేమలత ఆధ్వర్యంలో ఈ బొటిక్‌ను సినీ ప్రముఖులు, మోడల్స్‌తో కలిసి శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ లగ్జరీ బ్రాండ్‌లు అందుబాటులో ఉంటాయన్నారు.

5జీ యూజ్ కేస్ ల్యాబ్ సంబరాలు

రాయదుర్గం: కేంద్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకమైన 5జీ యూజ్ కేస్ ల్యాబ్ టాప్–100 సంస్థలలో గచ్చిబౌలిలోని ట్రిపుల్‌ఐటీ హైదరాబాద్‌కు అవకాశం కల్పించారు. దేశంలోని టాప్–100 ఇన్‌స్టిట్యూట్‌లలో ట్రిపుల్‌ఐటీ హైదరాబాద్ ఉండడం విశేషం. దీంతో ట్రిపుల్ ఐటీ ఫ్యాకల్టీ, విద్యార్థులు సంతోషం వ్యక్తం చేశారు. కాగా ట్రిపుల్ ఐటీ హైదరాబాద్‌లోని స్మార్ట్ సిటీ లివింగ్ ల్యాబ్‌కు చెందిన లీడ్ ఆర్కిటెక్ట్ అనురాధ వట్టెం 5–జీ యూజ్ కేస్ ల్యాబ్‌పై ప్రత్యేక ప్రదర్శన నిర్వహించారు.

కాంగ్రెస్‌లో చేరికలు



పార్టీలో చేరిన వారికి కండువాలు కప్పుతున్న జగదీశ్వర్‌గౌడ్

శేరిలింగంపల్లి: శేరిలింగంపల్లి నల్లగండ్లలోని కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి వి.జగదీశ్వర్‌గౌడ్ నివాసానికి కాంగ్రెస్ శ్రేణులు శనివారం క్యూ కట్టారు.కాంగ్రెస్ పార్టీ రెండవ జాబితాలో శేరిలింగంపల్లి టికెట్‌ను జగదీశ్వర్‌గౌడ్‌కు కేటాయించడంతో ఆయన నివాసానికి వచ్చి శాలువాలు, పూలమాలలతో శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం టీఆర్ఎస్ నాయకులు సురేందర్ ఆధ్వర్యంలో యువకులు భారీగా కాంగ్రెస్‌లో చేరడంతో వారికి జగదీశ్వర్‌గౌడ్ పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు.

నల్లగండ్ల మార్కెట్‌లో అగ్ని ప్రమాదం

- సుమారు రూ.18 లక్షల నష్టం



శేరిలింగంపల్లి: శేరిలింగంపల్లి నల్లగండ్ల కూరగాయల మార్కెట్‌లో శుక్రవారం అర్ధరాత్రి ఆరు షాపులు దగ్ధం అయ్యాయి. సుమారు 18 లక్షల మేర నష్టం వాటిల్లినట్లు వ్యాపారులు తెలిపారు. తెల్లవారుజామున 2.30 గంటల ప్రాంతంలో మంటలు అంటుకోవడంతో ఫైర్ స్టేషన్‌కు సమాచారం అందించడంతో వారు మంటలు రేగకుండా చర్యలు చేపట్టారు. ప్రభుత్వ విప్ ఆరికెపూడి గాంధీ అక్కడికి చేరుకొని వారికి అండగా ఉంటామని హామీ ఇచ్చారు. అదే విధంగా స్థానిక కార్పొరేటర్ రాగం నాగేందర్‌యాదవ్, శేరిలింగంపల్లి కాంగ్రెస్ అభ్యర్థి వి. జగదీశ్వర్‌గౌడ్, బీజేపీ నాయకులు బుచ్చిరెడ్డిలు అక్కడికి చేరుకొని ప్రమాద వివరాలు తెలుసుకొని అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. అలాగే ఈ ప్రాంతాన్ని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు రవికుమార్‌యాదవ్, నాయకులు శనివారం పరిశీలించి ఆదుకుంటామని హామీ ఇచ్చారు.

చంద్రగ్రహణం.. ఆలయాల మూసివేత

పటాన్‌చెరు టౌన్: చంద్రగ్రహణం నేపథ్యంలో ఆలయాలను మూసివేశారు.పటాన్‌చెరు మండలం రుద్రారం గ్రామ సమీపంలోని గణేష్‌గడ్డ దేవస్థానంతో పాటు పటాన్‌చెరు,అమీన్‌పూర్ పరిధిలోని దేవాలయాలకు మధ్యాహ్నం ఒంటి గంటకు తాళాలు వేశారు.ఈ సందర్భంగా అర్చకులు మాట్లాడుతూ... రాహుగ్రస్త చంద్రగ్రహణం సందర్భంగా ఆలయాలను మూసేసి, తిరిగి ఆదివారం ఉదయం 6 గంటలకు పూజలు ప్రారంభించడం జరుగుతుందని తెలిపారు.

‘ఆర్‌ఓబీ’తోనే అండర్‌బ్రిడ్జి సమస్య పరిష్కారం

లింగంపల్లి రైల్వే అండర్‌బ్రిడ్జి వద్ద పనుల నిలిపివేతతో ట్రాఫిక్ సమస్య తీవ్రం



లింగంపల్లి రైల్వే అండర్‌బ్రిడ్జి వద్ద పనులు ప్రారంభించిన చోట బారికేడ్లు ఏర్పాటు చేయడంతో రాకపోకలకు ఇక్కట్లు



లింగంపల్లి రైల్వే అండర్‌బ్రిడ్జి వద్ద ట్రాఫిక్

శేరిలింగంపల్లి: లింగంపల్లి రైల్వే అండర్‌బ్రిడ్జి వద్ద వరదనీటి సమస్యకు ఆర్‌ఓబీతోనే శాశ్వత పరిష్కారం లభిస్తుందని పలువురు అభిప్రాయపడుతున్నారు. ముఖ్యంగా జీహెచ్‌ఎంసీ కమిషనర్ రోనాల్డ్‌రాస్, ప్రభుత్వవిప్, శేరిలింగంపల్లి ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ అండర్‌బ్రిడ్జిని పరిశీలించిరూ.4 కోట్ల నిధులు కేటాయించి పనులు ప్రారంభింప చేశారు. కానీ అంతలో ఎన్నికలు రావడంతో అధికార యంత్రాంగం, ప్రజాప్రతినిధులు బిజీ అయ్యారు. ఆగిన పనులు మళ్ళీ ఎప్పుడు ప్రారంభమవుతాయోననే ఆందోళన అందరిలోనూ కనిపిస్తోంది.

మళ్లీ ట్రాఫిక్ సమస్య ..

- లింగంపల్లి, చందానగర్ ,మియాపూర్, పటాన్‌చెరు, ఆర్‌సీపురం వంటి ప్రాంతాల నుంచి నగరానికి, ఔటర్ రింగురోడ్డుకు, ఐటీ జోన్, ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్ ప్రాంతాలకు వెళ్ళాలంటే ఇదే ప్రధాన రోడ్డు కావడంతో నిత్యం ఉదయం, సాయంత్రం వేళల్లో పెద్ద ఎత్తున వాహనాల రాకపోకలు సాగిస్తుంటాయి.
- దీంతో ఈ రోడ్డుకు అత్యంత ప్రాధాన్యత నెలకొంది. అండర్‌బ్రిడ్జి ఉన్న ప్రాంతంలో ఇరుకుగా ఉండడం ఆ తర్వాత రోడ్డు విశాలంగా ఉండడంతో సమస్యలు నెలకొంటున్నాయి.
- అధికార యంత్రాంగం మధ్య సమన్వయలోపం వాహనదారుల పాలిట శాపంగా మారింది.
- ప్రస్తుతం రూ.4 కోట్లతో చేపట్టే బాక్స్‌టైప్ నాలా, వరదనీటి కాలువ నిర్మాణం కోసం తవ్వకాలు ప్రారంభించారు. కాగా మంచినీటి పైప్‌లైన్లు నాలుగు ఉన్నాయని వాటిని నిలిపివేసినట్లు తెలుస్తోంది.
- ఈ తవ్వకాలు జరిపిన చోట వాహనదారులు తీవ్ర ఇక్కట్లు పడుతూ రాకపోకలు చేస్తున్నారు. రోజురోజుకు ట్రాఫిక్ పెరిగిపోతోంది.
- మొదటి నుంచే చిన్న వర్షానికి వరద నీటితో లింగంపల్లి అండర్‌బ్రిడ్జి వద్ద రాకపోకలు నిలిచిపోవడం ఏటా జరిగే విషయం తెలిసిందే.
- కానీ ఈ సమస్యకు శాశ్వతంగా చెక్ పెట్టేందుకు వరదనీటి కాలువ, బాక్స్ కల్వర్టు పనులను ఆర్భాటంగా ఆరంభించి ఆ తర్వాత వదిలివేయడమే సమస్యకు దారి తీస్తోంది.
- పనులను ఆరంభిస్తూ చేపట్టిన చోట వాహనాల రాకపోకలకు ఇబ్బందులు కలుగుతున్నాయి

2024లోనైనా పూర్తయ్యేనా..?

- లింగంపల్లి అండర్‌బ్రిడ్జి వద్ద దశాబ్దాలుగా నెలకొన్న వరదనీటి సమస్య 2024లోనైనా తీరేనా...? అని ప్రజలు ప్రశ్నిస్తున్నారు.
- ఎన్నికల ముందు శంకుస్థాపన, హడావుడి పనులు ప్రారంభం ఆ తర్వాత నిలిపివేయడం చూస్తుంటే ఇక అంతేలే...? అనే అభిప్రాయాన్ని అందరూ వ్యక్తం చేస్తున్నారు.
- ముఖ్యంగా ఆర్‌ఓబీ నిర్మిస్తే శాశ్వతంగా ఈ సమస్య పరిష్కారమవుతుందని వాహనదారులు అంటున్నారు.

బీఆర్ఎస్ విజయం ఖాయం

ఆత్మీయ సమ్మేళనంలో ప్రభుత్వవిప్ గాంధీ



రాయదుర్గం: రాష్ట్రంలో బీఆర్ఎస్ మూడవసారి విజయం సాధించడం ఖాయమని ప్రభుత్వవిప్, ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ ధీమా వ్యక్తం చేశారు. కొండాపూర్ డివిజన్‌లోని నాగార్జున రెసిడెన్సీ కాలనీవాసులతో శనివారం ఆత్మీయ సమ్మేళనంను నిర్వహించారు. అందరి ఆశీర్వాదంతో మరోసారి విజయం సాధించి శేరిలింగంపల్లిని మరింత అభివృద్ధి చేసుకోవడానికి అవకాశం కల్పించాలని కోరారు. ఈ సమావేశంలో కార్పొరేటర్ షేక్ హమీద్‌పటేల్, రెసిడెన్సీ ప్రతినిధులు రామరాజు, సత్యనారాయణరాజు, పార్టీ నాయకులు చంద్రశేఖర్‌ప్రసాద్, రామరాజు తదితరులు పాల్గొన్నారు.



ఆత్మీయ సమ్మేళనంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే గాంధీ

హాఫీజ్‌పేట్ : హాఫీజ్‌పేట్ డివిజన్ పరిధిలోని ప్రజయ్ సిటి కాలనీలో ఎమ్మెల్యే గాంధీ ఆత్మీయ సమావేశాలు నిర్వహించారు.

అన్ని రంగాల్లో మహిళలకు ప్రాధాన్యం



గోపన్‌పల్లిలో మహిళలతో మాట్లాడుతున్న మాజీ కార్పొరేటర్ సాయిబాబా

రాయదుర్గం: మహిళా సమస్యల పరిష్కారంలో బీఆర్ఎస్ పార్టీ ముందుందని గచ్చిబౌలి డివిజన్ మాజీ కార్పొరేటర్ కొమిరిశెట్టిసాయిబాబా పేర్కొన్నారు. అన్ని రంగాలలో మహిళలకు అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నారన్నారు. ఈ గచ్చిబౌలి డివిజన్‌లోని గోపన్‌పల్లిలోని వీకర్ సెక్షన్ కాలనీవాసులు, మహిళా సంఘం సభ్యులతో ఆయన శనివారం సమావేశమయ్యారు. ఈ సందర్భంగా వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎమ్మెల్యే గాంధీ హయాంలో గత తొమ్మిదిన్నర ఏళ్ళలో ఎంతో అభివృద్ధి జరిగిందని గుర్తు చేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు రాజునాయక్, రాగం జంగయ్య యాదవ్, శంకరి రాజు ముదిరాజ్, రాణి, ఆసియా, బబ్లూనాయక్, వినోద్‌నాయక్ పాల్గొన్నారు.

అభివృద్ధి చూసి ఓటు వేయండి



కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి

రామచంద్రాపురం(పటాన్‌చెరు): ఒక కార్యకర్త వేయి ఓట్లతో సమానమని ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి అన్నారు.శనివారం రామచంద్రాపురం పట్టణంలోని లక్ష్మీ గార్డెన్‌లో ఏర్పాటు చేసిన రామచంద్రాపురం, భారతీనగర్ డివిజన్‌లకు చెందిన కార్యకర్తల విస్తృత స్థాయి సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేసీఆర్ ప్రభుత్వం చేసిన అభివృద్ధిని గడపగడపకు తీసుకెళ్లి వివరించాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు.ప్రతిపక్ష పార్టీలు అధికారంలో ఉన్న రాష్ట్రాలు అభివృద్ధిలో వెనుకబడ్డాయని తెలిపారు. ప్రజా సంక్షేమానికి కృషి చేస్తున్న తనను మరోసారి ఆశీర్వదించి భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో రాష్ట్ర శాసన మండలి మాజీ చైర్మన్ వెన్నవరం భూపాల్‌రెడ్డి, కార్పొరేటర్లు పుష్ప నగేష్, వెన్నవరం సింధు ఆదర్శ్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే సత్యనారాయణ, మాజీ కార్పొరేటర్ అంజయ్య యాదవ్, బీఆర్ఎస్ పార్టీ సర్కిల్ అధ్యక్షులు పరమేష్ యాదవ్, జిల్లా గ్రంథాలయాల డైరెక్టర్ కుమార్‌గౌడ్, పట్టణ బీఆర్ఎస్ అధ్యక్షులు గోవింద్, మార్కెట్ కమిటీ డైరెక్టర్ ఐలేష్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.



తారానగర్‌లో వేడుకల్లో పాల్గొన్న ప్రభుత్వ విప్ గాంధీ, కార్పొరేటర్ నాగేందర్‌యాదవ్ తదితరులు

గ్యార్వీ షరీఫ్ వేడుకలు

శేరిలింగంపల్లి: శేరిలింగంపల్లి తారానగర్‌లో గ్యార్వీ షరీఫ్ వేడుకలను భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. ఈ వేడుకల్లో ప్రభుత్వ విప్ ఆరికెపూడి గాంధీ, కార్పొరేటర్ రాగం నాగేందర్‌యాదవ్ పాల్గొని శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా గాంధీ మాట్లాడుతూ మత సామరస్యానికి ప్రతీక గ్యార్వీ షరీఫ్ అని అన్నారు. అనంతరం ఎమ్మెల్యే గాంధీని ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ వీరేశంగౌడ్, బీఆర్ఎస్ డివిజన్ అధ్యక్షులు రాజుయాదవ్, నాయకులు ఉరిటి వెంకట్రావ్, చింతకింది రవీందర్‌గౌడ్, పద్మారావు, ప్రవీణ్, రవీందర్‌రెడ్డి గోపాల్‌యాదవ్, ఖాజాపాష, అజీమ్, అస్లాం, గఫార్ పాల్గొన్నారు.



భళా.. నృత్య ప్రదర్శన

మాదాపూర్: శిల్పారామంలో నిర్వహిస్తున్న వారాంతపు కార్యక్రమాలలో భాగంగా శనివారం తాండవ ఆర్ట్స్ కూచిపూడి డ్యాన్స్ అకాడమి గురువు మధుసూదన్ శిష్యబృందం నృత్యప్రదర్శన ఆకట్టుకుంది. తాండవ నృత్యకారి, శివాష్టకం, భామాకలాపం, జయదేవ అష్టపది, గజవదన బేడువే, శివరంజని, తిల్లాన తదితర అంశాలను ప్రదర్శించారు. కళాకారులు అద్వైత, వైష్ణవి, సాత్విక, రిత్విక, శుక్లాచారి, సునీత తదితరులు పాల్గొన్నారు.

ఉల్లాసంగా సైకిల్‌రైడ్



రాయదుర్గం: గచ్చిబౌలిలోని హైదరాబాద్ బైసైక్లింగ్ స్టేషన్ నుంచి వీకెండ్ రైడ్ శనివారం ఉదయం 5.30 గంటలకు ప్రారంభమైంది. ఎస్కేప్ అండ్ ఎక్స్‌ప్లోర్ టీమ్ ఆధ్వర్యంలో హెచ్‌బీసీ బైసైక్లింగ్ స్టేషన్ నుంచి 30 కిలోమీటర్ల సైకిల్‌రైడ్‌ను గండిపేట్ వరకు నిర్వహించారు. ఎస్కేప్ అండ్ ఎక్స్‌ప్లోర్ వ్యవస్థాపకుడు అశోక్ మాట్లాడుతూ వీకెండ్‌లో సైక్లింగ్ ఉంటుందని, ఔత్సాహికులంతా పాల్గొనాలని సూచించారు. హెచ్‌బీసీ బైసైక్లింగ్ స్టేషన్ వద్ద ప్రారంభమైన సైకిల్ రైడ్ బయోడైవర్సిటీ పార్కు కూడలి, సైబరాబాద్ కమిషనరేట్, గచ్చిబౌలి కూడలి, ట్రిపుల్‌ఐటీ కూడలి, ఇండియన్ స్కూల్ ఆఫ్ బిజినెస్ మీదుగా విప్రో సర్కిల్, కోకాపేట్ గండిపేట్, ఓఆర్ఆర్ సైక్లింగ్ ట్రాక్ మీదుగా పుప్పాలగూడ వరకు నిర్వహించి అదేమార్గంలో తిరిగి హెచ్‌బీసీ సైక్లింగ్ స్టేషన్ వరకు రైడ్ నిర్వహించారు.

హెచ్‌సీయూలో క్లీనప్ డ్రైవ్



రాయదుర్గం: హైదరాబాద్ సెంట్రల్ యూనివర్శిటీలోని నేషనల్ సర్వీస్ స్కీమ్(ఎన్‌ఎస్‌ఎస్) సెల్ ఆధ్వర్యంలో శనివారం క్యాంపస్‌లో క్లీనప్ డ్రైవ్‌ను నిర్వహించారు. ఎన్‌ఎస్‌ఎస్ సెల్ హెచ్‌సీయూ కోఆర్డినేటర్ ఆధ్వర్యంలో వాలంటీర్లు, శానిటేషన్, హార్టికల్చర్ విభాగాల సహకారంతో చెత్తాచెదారం, ఆకులు, విరిగిపోయిన చెట్లకొమ్మలు, పిచ్చిమొక్కలను తొలగించారు. అనంతరం ఆయా ప్రాంతాలలో శుభ్రం చేశారు. సేకరించిన వ్యర్థాలు, చెత్తాచెదారాన్ని ట్రాక్టర్ ద్వారా చెత్త డంపింగ్‌యార్డ్‌కు తరలించారు. ఈ సందర్భంగా ఎన్‌ఎస్‌ఎస్ కోఆర్డినేటర్ బి కృష్ణయ్య హెచ్‌సీయూను క్లీన్ క్యాంపస్‌గా మార్చడమే లక్ష్యంగా పెట్టుకొని పనిచేస్తున్నామన్నారు. ఎన్‌ఎస్‌ఎస్ సెల్ ప్రోగ్రామ్ ఆఫీసర్ డాక్టర్ భీంసింగ్, అరుణ, శ్రీవాణి, సాయిఅఖిల, దివ్య, అన్వేష్, అజయ్‌ప్రకాశ్, వెంకటేష్, మహ్మద్ జునైద్, అభిలాష, ముస్తఫా తదితరులు పాల్గొన్నారు.

ఆగి ఉన్న ట్రాక్టర్‌ను ఢీ కొట్టిన బుల్లెట్

ఎంబీబీఎస్ విద్యార్థి మృతి, మరో విద్యార్థికి గాయాలు

పటాన్‌చెరు టౌన్: ఆగి ఉన్న ట్రాక్టర్‌ను బుల్లెట్ బండి ఢీ కొట్టిన ఘటనలో ఎంబీబీఎస్ థర్డ్ ఇయర్ చదువుతున్న విద్యార్థి అక్కడికక్కడే మృతి చెందగా, మరో విద్యార్థికి గాయపడ్డాడు. పటాన్‌చెరు పోలీస్‌స్టేషన్ ఏఎస్‌ఐ ఆందయ్య కథనం ప్రకారం.. జహీరాబాద్ దత్తగిరినగర్ కు చెందిన ధనురు సిద్ధార్థ్(23) పటాన్‌చెరు మండల పరిధిలోని ఇంద్రేశంలో ఉంటూ ఐనోల్‌లోని టీఆర్ఆర్ మెడికల్ కళాశాలలో ఎంబీబీఎస్ థర్డ్ ఇయర్ చదువుతున్నాడు.ఈ క్రమంలో శుక్రవారం రాత్రి ముత్తంగి నుండి సర్వీస్ రోడ్ మీదుగా ఇంద్రేశం వస్తుండగా మార్గమధ్యంలో ఆగి ఉన్న ట్రాక్టర్‌ను ఢీ కొట్టాడు. దీంతో బుల్లెట్ నడుపుతున్న ఎంబీబీఎస్ విద్యార్థి రోహిత్, వెనుక కూర్చున్న ధనురు సిద్ధార్థ్‌లు తీవ్రంగా గాయపడ్డాడు. వీరిని ఆస్పత్రికి తరలించగా సిద్ధార్థ్ అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. రోహిత్‌ను చికిత్స కోసం తరలించారు.మృతుడు సిద్ధార్థ్ మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం పటాన్‌చెరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి, పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

పద్యనాటిక రచనలో శర్మకు ప్రథమ బహుమతి



మియాపూర్ : ప్రజా పద్యం ఆధ్వర్యంలో ఆధునిక, సామాజిక స్పర్ధ నిర్వహించిన పద్య నాటిక రచన పోటీలలో శేరిలింగంపల్లి నియోజకవర్గంలోని హెచ్‌ఎంటీ స్వర్ణపురి కాలనీకి చెందిన విశ్రాంత మండల విద్యాధికారి, ప్రముఖ కవి, రచయిత కటకం వెంకటరామశర్మకు రాష్ట్రస్థాయి ప్రథమ బహుమతి లభించింది. ఈ మేరకు ఆదివారం నగరంలోని కూకట్‌పల్లిలోని భారత వికాస్ పరిషత్ చారిటబుల్‌లో నిర్వహించనున్న కార్యక్రమంలో వెంకట రామ శర్మ, ప్రముఖ రంగస్థల నటుడు గుమ్మడి గోపాలకృష్ణ, సినీగేయ రచయిత సిరాశ్రీల చేతుల మీదుగా బహుమతి అందుకోనున్నట్లు ఆయన తెలిపారు.

అవగాహన సదస్సు



అవగాహన కల్పిస్తున్న నిర్వాహకులు

ఆల్విన్‌కాలనీ: నియోకర్సర్, టెక్ మహీంద్రా ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిరుద్యోగ యువతకు ఉచిత శిక్షణ ఇస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. బ్యాంకింగ్, ఫైనాన్షియల్ సర్వీసెస్, ఇన్‌స్రూ పూర్తి బ్యాంకింగ్, ఫైనాన్షియల్ ఇండస్ట్రీ అవగాహన, సాఫ్ట్ స్కిల్, బేసిక్ ఐటి స్కిల్స్, స్పోకెన్ ఇంగ్లిష్‌లో ఉచిత సర్టిఫికేషన్ కోర్సును అందజేస్తున్నామన్నారు. మరిన్ని వివరాలకు 7799594242, 7799694242 నంబర్లలో సంప్రదించాలని కోరారు.

వెంకట్‌రావు ప్యానల్ ఘన విజయం

- ముగిసిన భెల్ ఎంఐజీ కోఆపరేటివ్ హౌసింగ్ సొసైటీ ఎన్నికలు

శేరిలింగంపల్లి: భెల్ ఎంఐజీ ఎంప్లాయిస్ కోఆపరేటివ్ హౌసింగ్ సొసైటీ ఎన్నికలు శనివారం ప్రశాంతంగా ముగిశాయి. భెల్ ఎంఐజీ కాలనీలో నిర్వహించిన పోలింగ్‌లో పి వెంకట్‌రావు(ఎంఎల్‌ఏ) ప్యానెల్ ఘన విజయం సాధించింది. ఈ సొసైటీ ఎన్నికలలో ఎస్సీ, ఎస్టీ కేటగిరి ఒక పోస్టుకు జరిగిన పోటీలో చింతా రాములు కమిటీ సభ్యుడుగా 140 ఓట్లు సాధించి విజయం సాధించారు. జనరల్ కేటగిరిలో 9 మంది పోటీ పడగా నలుగురు విజయం సాధించారు. వారిలో పి వెంకట్‌రావు(ఎంఎల్‌ఏ) 108 ఓట్లు, కెవిసుబ్బారావు 104 ఓట్లు, ఎస్ నారాయణ 101 ఓట్లు, ఎం నీలకంఠరావు 97 ఓట్లు సాధించారు. కాగా నీలకంఠరావు, బాలయ్య ఇద్దరికీ 97 ఓట్లు సమానంగా రావడంతో టాస్ వేయగా విజయం నీలకంఠరావును వరించింది. అనంతరం కాలనీవాసులు విజేతలకు శుభాకాంక్షలు తెలిపారు.



విజేతలను సత్కరించిన కాలనీవాసులు

సెక్టార్ అధికారుల పాత్ర కీలకం...

ఎన్నికల రిటర్నింగ్ అధికారి దేవుజ



సమావేశంలో మాట్లాడుతున్న అధికారులు

పటాన్‌చెరు టౌన్: అసెంబ్లీ ఎన్నికల్లో సెక్టార్ అధికారుల పాత్ర కీలకమని ఎన్నికల రిటర్నింగ్ అధికారి దేవుజ అన్నారు.శనివారం పట్టణంలోని ఎంపీపీ కార్యాలయంలో సెక్టార్ అధికారులతో సమావేశం నిర్వహించారు పోలింగ్ స్టేషన్లకు వెళ్లాల్సిన ఈవీఎంలను ఏ విధంగా సీలింగ్ చేయడం, భద్రపరచడంపై జిల్లా మాస్టర్ ట్రైనర్ కృష్ణ కుమార్ అవగాహన కల్పించారు. ఒక్కొక్క సెక్టర్ అధికారి పరిధిలో 8 నుండి 12 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయని, 38 రూట్‌లకు గాను, 38 మంది సెక్టార్ అధికారులు ఉన్నారని తెలిపారు.

రెండురోజుల శిక్షణ తరగతులు...

పటాన్‌చెరు నియోజకవర్గంతో పాటు, హత్నూర మండల పరిధిలోని పోలింగ్ ఆఫీసర్, అసిస్టెంట్ పోలింగ్ ఆఫీసర్లకు సోమ, మంగళవారాలు రెండు రోజులు శిక్షణ ఉంటుందని, సోమవారం 480 మందికి ,మంగళవారం 480 మందికి పటాన్‌చెరు పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఉదయం 10 గంటల నుండి సాయంత్రం 5 గంటల వరకు శిక్షణ ఉంటుందని తెలిపారు. తప్పనిసరిగా పీఓలు ,ఏపీఓలు శిక్షణకు హాజరు కావాలన్నారు. లేని పక్షంలో శాఖపరమైన చర్యలు తీసుకుంటామని ఎన్నికల రిటర్నింగ్ అధికారి దేవుజా ,మాస్టర్ ట్రైనర్ అమరేందర్ రెడ్డి తెలిపారు. కార్యక్రమంలో పటాన్‌చెరు తహశీల్దార్ భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

ఉచిత మెగా వైద్యశిబిరం

ఆల్విన్‌కాలనీ: కూకట్‌పల్లి డివిజన్ పరిధిలోని ఆస్‌బెస్టాస్ కాలనీలో కల్వరి హాస్పిటల్ ఆధ్వర్యంలో శనివారం ఉచిత మెగా వైద్యశిబిరం నిర్వహించారు. ఈ వైద్య శిబిరాన్ని శేరిలింగంపల్లి ఎమ్మెల్యే గాంధీ హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మెగా హెల్త్ క్యాంపును పరిసర ప్రాంతవాసులు వినియోగించుకోవాలన్నారు. శిబిరంలో 18 రకాల రక్తపరీక్షలు, బీపీ, షుగర్, గైనకాలజీ, ఆర్థో, ఈసీజీ, ఈఎన్‌టి, దంత, కంటి పరీక్షలు చేశారు. అర్హులైన వారికి కళ్లజోళ్లను అందించారు. కార్యక్రమంలో నాయకులు నాగేశ్వరరావు, అబ్దుల్, కృష్ణ, ఖయ్యూమ్ తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన పోస్ట్ కాంగ్రెస్–2023 సదస్సు

రాయదుర్గం: హైదరాబాద్ సెంట్రల్ యూనివర్శిటీలో ఇంటర్నేషనల్ యూనియన్ ఆఫ్ ఆంత్రోపాలజికల్ అండ్ ఎథ్నోలాజికల్ సైన్సెస్ (ఐయూఏఈఎస్), హెచ్‌సీయూ డిపార్ట్‌మెంట్ ఆఫ్ ఆంత్రోపాలజీ విభాగం సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన రెండు రోజుల సదస్సు శుక్రవారం రాత్రి ముగిసింది. ముగింపు సమావేశంలో ది బ్రిటీష్ యూనివర్శిటీ ఈజిప్ట్‌లోని సైబర్ సెక్యూరిటీ సైబర్‌క్రైమ్స్ ప్రోగ్రామ్ డైరెక్టర్ డాక్టర్ మహ్మద్ ఎల్ గిండి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. అనంతరం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం ప్రపంచవ్యాప్తంగా సైబర్ నేరాల సంఖ్య పెరుగుతున్నాయని, వాటిని అరికట్టే ప్రయత్నం కొనసాగిస్తున్నారన్నారు .డిజిటలైజ్‌లో మరింత వేగం పెరగాలని సూచించారు. ఈ కార్యక్రమాన్ని ప్రారంభ కార్యక్రమంలోయూనివర్శిటీ కాలేజ్ ఆఫ్ లండన్ ప్రొఫెసర్ డానియల్ మిల్లర్, జపాన్ ఒసాకా యూనివర్శిటీ జుంజికోయిజుమి, హెచ్‌సీయూ ఆంత్రోపాలజీ విభాగం హెడ్ ప్రొఫెసర్ ఎం రొమేష్‌సింగ్, ఆంత్రోపాలజికల్ సర్వే ఆఫ్ ఇండియా డైరెక్టర్ డాక్టర్ బివిశర్మ, హెచ్‌సీయూ స్కూల్ ఆఫ్ సోషల్ సైన్సెస్ డీన్ డాక్టర్ జ్యోతిర్మయిశర్మ, ఢిల్లీ యూనివర్శిటీ ఆంత్రోపాలజీ విభాగం హెడ్ ప్రొఫెసర్ ఎస్ఎన్ పట్నాయక్, ప్రొఫెసర్లు, విద్యార్థులు, అధికారులు పాల్గొన్నారు.

బెటాలియన్‌లో రక్తదాన శిబిరం



రక్తదానం చేస్తున్న పోలీసులు

గచ్చిబౌలి: పోలీసు అమరవీరుల వారోత్సవాల్లో భాగంగా హైదరాబాద్ రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో కొండాపూర్ 8వ బెటాలియన్‌లో శనివారం రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా కమాండెంట్ సి.సన్నీ మాట్లాడుతూ రక్తదానం చేయడం వల్ల విలువైన వ్యక్తుల ప్రాణాలను కాపాడవచ్చన్నారు. అన్ని దానాల కంటే రక్తదానం గొప్పదని ఆయన పేర్కొన్నారు. శాంతిభద్రతల పరిరక్షణలో ప్రాణాలు అర్పించిన పోలీసు అమరవీరుల త్యాగాలను కొనియాడారు. కార్యక్రమంలో అడిషనల్ కమాండెంట్ సుబ్రహ్మణ్యం, అసిస్టెంట్ కమాండెంట్లు నర్సింహస్వామి, సత్యనారాయణ, నారాయణదాస్, యూనిట్ మెడికల్ ఆఫీసర్ జ్యోబా పులే, రెడ్ క్రాస్ సొసైటీ మెడికల్ ఆఫీసర్ జనార్దన్ తదితరులు పాల్గొన్నారు.